సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో వెలుగులు

- వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



సహపంక్తి భోజనం చేస్తున్న ఎంవీవీ తదితరులు



16వ వార్డులో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు హారతి పడుతున్న మహిళ

మద్దిలపాలెం : దేశానికి ఆదర్శనీయంగా సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రంలో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సంక్షేమ ప్రదాతగా సీఎం వైఎస్ జగన్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 16వ వార్డులో 57వ రోజున హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్ స్టాప్, పాత వెంకోజీపాలెంలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావుతో కలిసి పాదయాత్ర చేశారు. గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధి పొందిన వారితో ముచ్చటించారు. ఎంపీకి హారతి ఇచ్చి మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయచంద్ర ఇంట్లో ఎంవీవీ సహపంక్తి భోజనం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం 19వ వార్డు వాసవానిపాలెంను సందర్శించారు. గడపగడపకు వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా వాసవానిపాలెంకు చెందిన బోగిపిల్లి విజయచంద్ర, విజయశ్రీల ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీ ఎంవీవీ సహపంక్తి భోజనం చేశారు.

రాధాకృష్ణ యాదవ సంఘంతో ఆత్మీయ సమావేశం



ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందిస్తున్న రాధాకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంపీ, వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేయడంతో పాటు ప్రాధాన్యత కల్పించారన్నారు. ఇప్పటికే వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి ఇసుమంతైనా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అనంతరం ఎంవీవీని సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ శశిప్రభ
- వీఎంఆర్‌డీఏ పార్కులో మహిళా దినోత్సవం



డాక్టర్ శశిప్రభను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఏయూ క్యాంపస్: మహిళలు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ ఆర్.శశిప్రభ అన్నారు. ఆదివారం ఉదయం వీఎంఆర్‌డీఏ పార్కులో సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్స వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్యాన్సర్ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక అవగాహనతో అవసరమైన వైద్య పరీక్షలు తరచూ చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించడం సాధ్యపడుతుందన్నారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి పలువురు మహిళా సభ్యు లను సత్కరించారు. మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం, మహిళల సాధికారతకు కృషి చేయాల్సిన అవసరాన్ని క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి వివరించారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతుందని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ సింహాచలం తెలిపారు. వేడుకల్లో భాగంగా క్లబ్ సభ్యులకు అగ్ని ప్రమాదాలకు కారణాలు, అవకాశాలను తెలియజేశారు. ఇంట్లో గ్యాస్ లీకేజీ ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపారు. అగ్నిమాపక నియంత్రణ ఉపకరణాలను ఉపయోగించడంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమలో క్లబ్ కార్యదర్శి జి.తిరుపతిరావు, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు, క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ పెదసోములు, ఎం.వెంకటరావు, ఆచార్య తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: కైలాసగిరి 11కేవీ ఫీడర్ నిర్వహణ, చెట్ల తొలగింపు పనుల దృష్ట్యా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతవాక కొండ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో గ్లకోమా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టి లోపం కలిగించే వ్యాధి అని, ఇదీ కొన్ని రకాల స్టెరాయిడ్స్ వాడకం వల్ల వస్తుందని వైద్యులు తెలిపారు. ఈ వారోత్సవాలను స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా అనే అంశంతో చేపట్టారు.

మహిళలకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వుయ్ సపోర్ట్ వుమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో నారాయణ మూర్తి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ బీచ్



తీరంలో శుభ్రం చేస్తున్న ప్రగతి యువ భారతి ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: ప్రగతి యువ భారతి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ బీచ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యువ భారతి అధ్యక్షుడు ఆశీష్, తదితరులు పాల్గొన్నారు.

సాయి హంతకులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు

బీచ్ రోడ్డు: ఫొటో షూట్ ఉందని పిలిచి మధురవాడ ప్రాంతానికి చెందిన పోతిన సాయి విజయ్ పవన్ వద్ద కెమెరాను తీసుకొని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయి మృతికి సంతాపం తెలుపుతూ ఆర్కేబీచ్ వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయి కుటుంబ సభ్యులకు అండగా నిలవాలన్నారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

లలితా పీఠంలో హోమం

సీతంపేట: మాఘ అమావాస్య సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ఆదివారం వేద పండితులు ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం ఆచరించారు. ఈ హోమం చేయడం వల్ల ప్రతికూల, చెడు ప్రభావాలు నశిస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- 18వ వార్డులో 1,500 మంది, 19వ వార్డులో 2 వేల మంది..
- కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ ఎంవీవీ



పార్టీలో చేరిన వాసవానిపాలెం మత్స్యకారులు

ఎంవీపీకాలనీ: 18వ వార్డు వాసవానిపాలెంకు చెందిన 1,500 మందికి పైగా మత్స్యకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం రాత్రి వాసవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలనకు ఆకర్షితులై తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ ఎంవీవీ సమర్థ నాయకత్వంపై నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ వార్డులో పెద్ద ఎత్తున ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని వారికి సూచించారు. గ్రామదేవతల సాక్షిగా 18వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయచందర్, పార్టీ నాయకులు ఎల్లాజీ, పరదేశి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. దీంతోపాటు 19వ వార్డు ప్రియదర్శిని కాలనీ, బాపూజీనగర్‌లోనూ రెండు వేల మంది ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, దాసు, గణేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


అధ్వానంగా పాత రామకృష్ణాపురం స్థలం



పిచ్చి మొక్కలతో నిండిన పాత రామకృష్ణాపురం స్థలం

ఆరిలోవ: ఒకప్పుడు కమ్మల పాకలతో కళకళలాడిన ఆ గ్రామం ఇప్పుడు పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారింది. సుమారు ఎకరం విస్తీర్ణం గల ఆ గ్రామ స్థలం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురం గ్రామం ఉంది. ఇక్కడ సుమారు 700 వరకు కమ్మల పాకలు ఉండేవి. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించినప్పుడు సుమారు 10 ఏళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు ఇక్కడ రోడ్డుకు అడ్డంగా ఉన్న గ్రామంలో కమ్మల పాకలను తొలగించి ప్రత్యామ్నాయం కల్పించారు. అక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో బీఆర్‌టీఎస్‌కు ఓ పక్క కొంత ఖాళీ స్థలం ఉండగా రెండో పక్క కొన్ని నివాసాలు మిగిలిపోయాయి. వాటిని తొలగించలేదు. ఇప్పుడు ఆ నివాసాలన్నీ మరో గ్రామంగా మారింది. ఇదిలా ఉండగా ఓపక్క ఖాళీగా ఉన్న స్థలాన్ని జీవీఎంసీ స్వాధీనం చేసుకొని దాని చుట్టూ కంచె నిర్మించి వదిలేసింది. దీన్ని సామాజిక అవసరాల కోసం వినియోగిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోకపోడంతో దానిలో ఓ జీవీఎంసీ కాంట్రాక్టర్ వాటర్ పైపులు వేసి వదిలేశాడు. నాలుగేళ్ల క్రితం అగ్నిప్రమాదానికి గురై కొన్ని పైపులు కాలిపోయాయి. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మద్యం తాగడం, గంజాయి పీల్చడంతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిత్యకృత్యంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలాన్ని శుభ్రం చేయించి సామాజిక అవసరాలలో భాగంగా పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్



ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించాయి. ప్రఖ్యాత కథకులు సీతా శ్రీనివాస్ ఆఫ్రిక కథ పద్ధతిలో సైన్స్, మ్యాథ్స్ కాన్సెప్ట్‌లను కథల రూపంలో పిల్లలు ఆసక్తిగా వినేలా చెప్పారు. ఆకర్షణీయమైన కథల ద్వారా సమయం, దూరం, గురుత్వాకర్షణ, శిలలు తదితర విషయాలపై వివిధ భావనలను వివరించారు. అద్భుతమైన కథా కళ ద్వారా చక్కటి కథలు చెప్పి పిల్లలను మంత్రముగ్ధులను చేశారు. ఆఫ్రికాలోని గొప్ప జానపద కథల నుంచి ప్రేరణ పొందిన కథలను కథా నైపుణ్యాలతో పిల్లలకు బోధించారు. కథ చెప్పడంతోపాటు సమయానికి తగిన పాటలు, అభినయనంతో చిన్నారుల ఆసక్తిని కథల వైపు మళ్లించారు. అనంతరం ఓరగామి, వర్క్‌షీట్‌లను నింపడం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సర్కారు దన్ను

- పథకాలతో మేలు చేసిన సీఎం జగన్
- అంబులెన్స్‌ల ద్వారా ఇంటి వద్దనే వైద్యం



1962 అంబులెన్స్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలుస్తోంది. పాడి పశువుల ఆరోగ్యంతో పాటు రైతులకు ఆదాయం చేకూరేలా పథకాలు అమలు చేస్తోంది. విశాఖ జిల్లాలో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లలో ఎంతో మంది పాడి రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చారు. వైఎస్సార్ పశు బీమా, వైఎస్సార్ పశు నష్ట పరిహారం, అంబులెన్స్‌లు ద్వారా పశు ఆరోగ్య సేవలు, అమూల్ పాల సేకరణ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు చేయూతనిచ్చారు. పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న అనేక పథకాలను వేలాది మంది పాడి రైతులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఆయా పథకాల వివరాలిలా ఉన్నాయి.

వైఎస్సార్ పశు బీమాతో ధీమా



దూడకు ఇన్సూరెన్స్ బిల్లా వేస్తున్న రైతు భరోసా కేంద్రం సహాయకురాలు

వైఎస్సార్ పశు బీమా పథకాన్ని 2023–24 సంవత్సరంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు కూడా బీమా చేయించుకోవచ్చు. ఏపీఎల్, బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులు. ఆవులు, గేదెలకు మూడేళ్ల పాటు బీమా చేయడానికి రూ.2 వేలు చెల్లించాల్సి ఉంది. కానీ పాడి రైతులు 20 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. గొర్రెలు, మేకలకు బీమా కోసం రూ.400 కట్టాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు 20 శాతం మాత్రమే బీమా రుసుం చెల్లించాలి. మిగతా 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. విశాఖ జిల్లాలో ఇంత వరకు 2,210 ఆవులు, 652 గేదెలు, 139 మేకలు, 69 గొర్రెలకు బీమా చేయించారు. దూడ పుట్టిన నుంచి 15 సంవత్సరాల వరకు బీమా చేయించవచ్చు. ఇంత వరకు జిల్లాలో ఇందు కోసం రూ.25 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది.

వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం

పాడి పశువు మరణిస్తే రైతు నష్ట పరిహారం పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. పుట్టిన 2 నుంచి 12 సంవత్సరాలు వయసు గల పాడి పశువు(కనీసం ఒక ఈత ఈని ఉండాలి) మరణిస్తే నష్ట పరిహారం అందుతుంది. ఈ పథకం 2022 నుంచి అమలులో ఉంది. ఇంత వరకు జిల్లాలో 2,872 మది పాడి రైతులు ఈ పథకం ద్వారా రూ.8.12 కోట్ల పరిహారం పొందారు. మరో 729 మంది లబ్ధిదారులకు రూ.2.16 కోట్లు ట్రెజరీలో పెండింగ్‌లో ఉంది.

56 రైతు భరోసా కేంద్రాలు

జిల్లాలో 56 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో పశు వైద్య సహాయకులు అందుబాటులో ఉన్నారు. రాజన్న పశు వైద్యం ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటి వద్దకు వెళ్లి అవసరమైన మందులు కూడా సరఫరా చేస్తున్నారు. రైతులకు పాల ఉత్పత్తి, పశువుల ఆరోగ్యంపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. 2023–24లో 60 శాతం రాయితీపై సమీకృత దాణా అందిస్తున్నారు. ఇంత వరకు 742 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

అమూల్ పాల సేకరణ

పాడి రైతులకు చేయూతనివ్వడానికి అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఈ కేంద్రాల ద్వారా లీటరు పాలుకు రూ.5 అదనంగా ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా రోజుకు 30,000 లీటర్ల పాలు సేకరిస్తున్నారు.

'భీమిలి'లో వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

ఇంతవరకు ఎప్పుడూలేని విధంగా పశువులకు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇటీవల జిల్లాలో భీమిలి నియోజకవర్గంలో ఈ ప్రయోగశాల ఏర్పాటు చేశారు. దీనిలో ఇప్పటి వరకు 3,253 పశువులకు క్షేత్రస్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టారు.

వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ



సమీకృత దాణా ప్యాకెట్లు

వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ ద్వారా 1962 నంబరుతో అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. 1962 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా పాడి రైతులు ఈ సేవలు పొందవచ్చు. ఇందులో పశువులకు 12 రకాల పరీక్షలు చేస్తారు. ఒక వైద్యుడు, మరో సహాయకుడు, ఓ డ్రైవర్ అందుబాటులో ఉంటారు. పెద్ద హైడ్రాలిక్ నిచ్చెన ఉంటుంది. నడవలేని పశువులను ఈ నిచ్చెన ద్వారా అంబులెన్స్‌లోకి ఎక్కించి అందుబాటులో ఉన్న పశు వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తారు. జిల్లాలో 10 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంత వరకు జిల్లాలో ఈ అంబులెన్స్‌ల ద్వారా 29,686 పాడి పశువులకు వైద్య సేవలు అందించారు.

జిల్లాలో పశువులకు సౌకర్యాలు

జిల్లాలో పశువుల ఆస్పత్రులు–3, పశు వైద్య కేంద్రాలు–17, గ్రామీణ పశు వైద్య కేంద్రాలు–2, గోపాల మిత్ర కేంద్రాలు–14, రైతు భరోసా కేంద్రాలు–56 ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో ఘనీకృత వీర్య కేంద్రం, యాంత్రాలజీ ల్యాబ్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, జాతీయ పశు వ్యాధుల పరిశోధన కేంద్రం,, ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ శిక్షణా కేంద్రం ద్వారా పాడి రైతులకు సేవలు అందుతున్నాయి. ఇవి గాక గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, పశువులకు వ్యాధి నివారణ టీకాలు, కృత్రిమ గర్భధారణ, పశుగ్రాస సాగు, రైతు సదస్సులు కొనసాగుతున్నాయి.

పాడి రైతులు మేలు చేస్తున్నాం..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా పశు సంవర్ధక శాఖ పాడి రైతులకు ఎంతో మంచి చేస్తోంది. 1962 నంబరుతో జిల్లాలో 10 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో పాల ఉత్పత్తి పెంపుదల, పశువుల ఆరోగ్యంపై రైతులకు తరచూ అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు సబ్సిడీపై దాణా సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ పశుబీమా, వైఎస్సార్ పశు నష్ట పరిహారం, తదితర పథకాల ద్వారా మేలు చేస్తున్నాం.

– రామకృష్ణ, జేడీ, విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ

పేద విద్యార్థులకు 'ఆప్తా' స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందిస్తున్న లక్ష్మీనారాయణ

ఎంవీపీ కాలనీ: వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు అమెరికన్ తెలుగు ప్రొగ్రెసివ్ అసోసియేషన్(ఆప్తా) ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం ఎంవీపీ కాలనీలోని ఐఏఎం ఆవరణలో ఆదివారం జరిగింది. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోగలరన్నారు. మరో అతిథి దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆప్తా సభ్యుడు ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ 2008లో అమెరికాలో స్థిరపడిన తెలుగువారంతా కలిసి ఆప్తా ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు 35 రకాల సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 2023–24 ఏడాదికి 50 మందికి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఓఎస్‌డీ ఆచార్య కృష్ణమోహన్, సుహాస్ బలిరెడ్డి, నవీన్‌కుమార్ పాసం, కొండూరు అరుణ్, కాత్యాయని, కల్యాణి, బ్రహ్మంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.